విధ్వంస రచన.. తీరని వేదన

ఫోకస్

పాలకులు, యంత్రాంగం ఏ చర్యలు చేపట్టినా అది ప్రజలకు మేలు చేయాలి. కానీ ఇక్కడ విభిన్నంగా ఉంది. ఆపరేషన్ లంగ్స్ పేరిట జీవీఎంసీ చేపట్టిన చిరువ్యాపారుల దుకాణాల తొలగింపు పేద ప్రజలను దిక్కుతోచని స్థితిలోకి నెట్టింది. వందలాది కుటుంబాలను రోడ్డున పడేసింది. వారికి తీరని వేదన మిగిల్చింది. దశాబ్దాల తరబడి నడుస్తున్న బతుకు బండిని పోక్లెయిన్‌తో పెకిలించేసింది. ఈ క్రమంలో చిరువ్యాపారుల ఆక్రందనను కనీసం పట్టించుకోలేదు. ప్రత్యామ్నాయం చూపి తమ షాపులు తొలగించాలని వేడుకున్నా ఖాతరు చేయలేదు. ఉన్నపళంగా బడ్డీలు, దుకాణాలను తొలగించి వారికి కంటిమీద కునుకులేకుండా చేసింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో.. బతుకుబండి ఎలా నడపాలో తెలియక చిరువ్యాపారులు సతమతమవుతున్నారు.



సీతారామరాజునగర్‌లో దుకాణం తొలగించడంతో రోడ్డున పడిన రజకుడు

- పేదల పొట్ట కొట్టిన ఆపరేషన్ లంగ్స్
- తమకు ఊపిరి ఆడకుండా చేశారని చిరువ్యాపారుల ఆవేదన
- ప్రత్యామ్నాయం చూపకుండా తొలగించడంపై మండిపాటు
- హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్



సుజాత కాలనీలో ఫుట్‌పాత్ పై దుకాణాలు తొలగిస్తున్న అధికారులు



గోపాలపట్నంలో దుకాణాలు తొలగిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: ఆపరేషన్ లంగ్స్ పేరుతో ప్రణాళికా బద్ధంగా విధ్వంసకర రచనకు పూనుకున్నారని తోపుడు బళ్లు, చిరు వ్యాపారులు వాపోతున్నారు. కొన్ని దుకాణాలను విరిచేశారు. మరికొన్నింటిని క్రేన్లతో తీసుకు పోయారు. జీవనాధారాలను ధ్వంసం చేశారు. షాపుల తొలగింపు సమయంలో నిర్దయగా వ్యవహరించారని వ్యాపారులు వాపోతున్నారు.

పేదలను రోడ్డుమీద పడేశారు

చిరు వ్యాపారాలు చేసుకుని బతుకుతున్న పేదలను రోడ్డు పడేశారు. 'కూటమి నాయకులు పేదలను కోటీశ్వరులు చేస్తామంటే ఆశతో ఓట్లు వేసి గెలిపించుకున్నాం..అందుకే తమను రోడ్డున పడేశార'ని వారంతా తీవ్ర స్థాయిలో మండి పడుతున్నారు.

ప్రణాళికా బద్ధంగా...

ముందు వ్యూహం వేసుకుని ఈ విధ్వంసానికి తెర తీశారని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తొలుత అంతా నిర్ణయించుకునే సమయం చూసి తమ బతుకులను రోడ్డున పడేశారని శాపనార్థాలు పెడుతున్నారు. కార్పొరేటర్లు టూర్‌లో... ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లిన సమయంలో ప్లాన్ ప్రకారం అధికారులు ఈ దారుణానికి ఒడిగట్టారని వాపోతున్నారు. ఇదంతా నాయకులు, అధికారులు, పోలీసులకు ముందే తెలిసి జరిగిందని మండిపడుతున్నారు.

300 దుకాణాల తొలగింపు

ఎన్ఏడీ, గోపాలపట్నం, వేపగుంట తదితర ప్రాంతాల్లో 300 చిరు దుకాణాలు తొలగించారు. వీరంతా రోడ్డున పడి తమ భవిష్యత్తు ఏంటని మదన పడుతున్నారు. పిల్లల చదువులు, అప్పులు అన్నీ వ్యాపారాలపై ఆధార పడి ఉన్నాయి. ఉన్నపళంగా దుకాణాలు తొలగించడంతో తమకు ఏదారి చూపిస్తారో అధికారులు నాయకులు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి సన్నద్ధమవుతున్నారు.

ఎలా బతకాలి?



మా బతుకులు రోడ్డున పడ్డాయి. అధికారులు చేసిన చర్యల వల్ల ఎలా బతకాలో అర్థం కావడం లేదు. అధికారులు, పాలకులే మాకో దారి చూపించాలి. లేకపోతే రోడ్డుమీదే మా ఆవేదనను వ్యక్తం చేస్తాం.

– కుమారి, వ్యాపారస్తురాలు గోపాలపట్నం

కక్ష కట్టినట్టు వ్యవహరించారు



చిరువ్యాపారులపై చూపిన ప్రతాపం విధ్వంసకర చర్యలను తలపించాయి. మాపై కక్షకట్టినట్టుగా వ్యవహరించారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఉన్నపళంగా తొలగించేశారు. కట్టు బట్టలతో రోడ్డు మీద నిలబెట్టారు. ఒకరి మీద ఒకరు సాకులు చూపుతూ తెలీదన్నట్లుగా మాట్లాడుతున్నారు.

–జి. మురళీ కృష్ణ తోపుడు బళ్ల వ్యాపారుల సంఘం అధ్యక్షుడు, గోపాలపట్నం

హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలి



ప్రత్యామ్నాయం చూపకుండా దశాబ్దాలు తరబడి వ్యాపారాలు చేసుకుంటున్న మాపై ప్రతాపం చూపారు. తొలగింపులపై కనీసం ముందస్తు సమాచారం ఇవ్వలేదు. హైకోర్టు ఆదేశాలను సైతం పట్టించుకోలేదు. న్యాయం జరిగే దాక పోరాటాలు కొనసాగిస్తాం.

– జగదీష్, తోపుడు బళ్ల వ్యాపారుల సంఘం కార్యదర్శి, గోపాలపట్నం

రోడ్డున పడేశారు



మా కుటుంబాలను రోడ్డున పడేశారు. ఎలా బతకాలో తెలియని పరిస్థితిలో ఉన్నాము. మా కడుపు మీద కొట్టారు. మా బతుకులు నాయకులు, అధికారులకు పట్టవా?. ఒక్కసారి మా ఉపాధిపై దెబ్బకొడితే ఇబ్బంది పడతామన్న ఆలోచన లేకపోవడం దురదృష్టకరం. హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి జీవనోపాధి కల్పించాలి.

–వరలక్ష్మి, గోపాలపట్నం



తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన పార్టీ ముఖ్య నేతలు, సమన్వయకర్తల సమావేశంలో పాల్గొన్న విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్

పచ్చదనం పెంపునకు చర్యలు



ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ దిగువ సర్కిల్‌లో మొక్కలు నాటుతున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్‌లోని ఫ్లైఓవర్ దిగువ సర్కిల్‌లో మొక్కలు నాటడానికి ఎట్టకేలకు వీఎంఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టారు. నిర్వహణ లేకపోవడంతో దిగువ భాగం కళావిహీనంగా మారిన వైనంపై సాక్షి దినపత్రికలో కథనం రావడంతో అధికారులు స్పందించారు. దిగువ రోడ్డు వద్ద, ఎగువ నడక దారిలో సుందరీకరణ పనులు చేపట్టారు. పూల మొక్కలు వేస్తున్నారు. ఇది చూసిన వారు సాక్షిని మెచ్చుకుంటున్నారు. అలాగే పాడైన రైలింగ్, లైటింగ్‌తో పాటు సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ



కార్యక్రమంలో పాల్గొన్న నోడల్ అధికారి హేమలత,వైద్యురాలు నాన్సీ తదితరులు

మల్కాపురం: మహిళల ఆరోగ్యంపై కేంద్రం దృష్టిసారించిందని ప్రముఖ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ హేమలత అన్నారు. 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ కల్యాణమండపం వద్ద బుధవారం స్వస్థ్ నారీ స శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మహిళలకు నోటి క్యాన్సర్,రొమ్ముక్యాన్సర్,గర్భాశయ క్యాన్సర్‌తో పాటు రక్తపోటు, మధుమేహం వంటి అనారోగ్య సమస్యలకు వైద్య సేవలు ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగుతందని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే బలమైన కుటుంబాల నిర్మాణానికి దోహదపడుతుందనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలోమల్కాపురం యూపీహెచ్‌సీ వైద్యురాలు నాన్సీ, నాయకులు మజ్జి సోమేష్,కాకి పోలిరెడ్డి,ఆశ వర్కర్లు,ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీని వ్యతిరేకిస్తూ పాదయాత్ర



ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నాయకులు

గాజువాక: అదానీ సిమెంట్ ఫ్యాక్టరీని పెదగంట్యాడ ప్రాంతంలో ఏర్పాటు చేయవద్దంటూ సీపీఎం నాయకులు బుధవారం గాజువాకలో పాదయాత్ర నిర్వహించారు. పాతగాజువాకలో ప్రారంభమైన పాదయాత్ర మెయిన్ రోడ్ మీదుగా కొత్తగాజువాక వరకు కొనసాగింది. అనంతరం అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ గంగవరం పోర్టు కాలుష్యం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇప్పుడు గోరుచుట్టుపై రోకలిపోటు మాదిరిగా అదానీ సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని చూడడం దారుణమన్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటైతే పెదగంట్యాడ, గాజువాక, మల్కాపురం, ప్రాంతాలకు చెందిన పది లక్షలమంది ప్రజలు కాలుష్యం బారిన పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం వల్ల గర్భస్రావాలు, క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వచ్చేనెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, లక్ష్మి, సంతోష్, కిరీటం, రాము, అవతారం తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు వెండి ఊయల బహూకరణ



వాసవీ మాతకు ఊయల బహూకరిస్తున్న దాతలు

గాజువాక: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారికి గాజువాక ఆర్యవైశ్య సంఘం నాయకులు కేసారపు శ్రీను రమేష్, లక్ష్మీ దంపతులు వెండి ఊయలను బహూకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ కమిటీ ప్రతినిధులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తాళ్లూరు మల్లేశ్వరరావు, కులుకూరి మంగరాజు, కేసారపు సతీష్, కోట అనంత గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26న ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో పది కంపెనీలు పాల్గొని 300 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఏదైనా డిగ్రీ చదివిన ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్యం.ఏపీజీఓవి.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిట్ కార్డ్‌తో హాజరు కావాలని తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్ సౌకర్యం కూడా ఉందని మరిన్ని వివరాలకు 8555868681 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

9 శాతం వడ్డీకి రుణాలు ఇవ్వాలని ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్ఏసీఎస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపో సివిల్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా 9 శాతం వడ్డీతో అన్ని రకాల రుణాలు ఇవ్వాలని ఎన్ఏసీఎస్ అండ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మెయిన్ గేటు వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ గురువారం ఎన్ఏడీ సొసైటీ కార్యాలయంలో నిర్వహించబోయే సర్వసభ్య సమావేశంలో పాలకవర్గం 9 శాతం వడ్డీకి రుణాలు ఇవ్వనున్నట్టు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పాలకవర్గం రాజీనామా చేయాలన్నారు. అంతే కాకుండా సెక్యూరిటీ హోల్డర్లపై అనధికార చర్యలను తక్షణమే ఆపాలని కోరారు. సొసైటీ గదితో ప్రాంగణాన్ని వ్యక్తిగత అవసరాలకు వినియోగించడం కో ఆపరేటివ్ సొసైటీ నిబంధనలకు విరుద్ధమన్నారు. సభ్యుల ప్రయోజనాల కోసం పని చేయాల్సిన పాలకవర్గం అరచకాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సభ్యుల ప్రయోజనాలకు భంగం కలిగే చర్యలు మానుకోకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

24 గంటలూ వైద్య సేవలు అందించాలి



మాట్లాడుతున్న ఇంటక్ జాతీయ నాయకుడు మంత్రి రాజశేఖర్

పెదగంట్యాడ: పెదగంట్యాడలోని స్టీల్‌ప్లాంట్ హెల్త్ సెంటర్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఇంటక్ జాతీయ నాయకుడు మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హెల్త్ సెంటర్ వద్ద ఐఎన్‌టీయూసీ నాయకులతో కలసి బుధవారం పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ హెల్త్ సెంటర్ పరిసర ప్రాంతాల కార్మికులకు ఎంతో ఉపయోగకరమని.. ఇప్పుడు హెల్త్ సెంటర్ 24 గంటల సేవలు నుంచి మినహాయించి సిబ్బందిని తగ్గించడం బాధాకరమన్నారు.కేవలం డాక్టర్, సిబ్బందితో జనరల్ షిఫ్ట్‌లో మాత్రమే సేవలందిస్తే..మిగతా రెండు షిఫ్ట్‌ల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏదైనా ప్రమాదం జరిగి అత్యవసర వైద్యం అందక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని 24 గంటలు తగిన సిబ్బందితో కార్మికులకు సేవలందిచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు పీవీ రమణ మూర్తి, బీఎస్ రాజా, కొమ్ము ప్రసాద్, రమణ, పోలీసు నాయడు,మంత్రి గోపీనారాయణ, కోరిబిల్లి అప్పారావు, ఎల్లాజీరావు, పూతి పోతయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యానందకరి.. సౌందర్య రత్నాకరి


- అన్నపూర్ణాదేవిగా కనకదుర్గమ్మ
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



వివిధ అవతారాల్లో కొలువుదీరిన అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారి భజనలు చేస్తున్న భవానీ భక్తులు



పిలకవానిపాలెం దుర్గాదేవి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా..

మల్కాపురం: కనకదుర్గాదేవి అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూడోరోజు బుధవారం అమ్మవారిని అన్నపూర్ణగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. పలు ఆలయాల్లో అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

- జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం కొండ ప్రాంతంలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు. పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ గిన్ని శివరెడ్డి దంపతులు అమ్మవారిని నందివర్ధన పుష్పమాలలతో అలంకరించారు. బత్తాయి పండ్లు, అపిల్లను నైవేద్యంగా సమర్పించారు. పలువురు భవానీ భక్తులు తల్లి కీర్తనలను ఆలపిస్తూ భజనలు చేశారు.
- స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు విళ్లూరి కృష్ణప్పారావు నాయుడు గృహంలో దేవీనవరాత్రుల సందర్భంగా అమ్మవారి రూపాలను నెలకొల్పారు. బాల త్రిపుర సుందరీదేవి, గాయత్రీదేవి, అన్నపూర్ణాదేవి, కాత్యాయినీదేవి, మహాలక్ష్మిదేవి, లలితా త్రిపుర సుందరిదేవి, సరస్వతీదేవి, దుర్గాదేవి, మహిషాసుర మర్దిని, రాజరాజేశ్వరి అమ్మవార్ల ప్రతిమలను కొలువుదీర్చి, భక్తితో పూజలు చేస్తున్నారు.
- మల్కాపురం గొల్లవీధి, పల్లివీధి, మార్కెట్ వీధి వద్ద నెలకొల్పిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.

కొనసాగుతున్న ఎన్ఎంయూ రిలే నిరాహారదీక్షలు



దీక్ష చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు

ఉక్కునగరం: కూర్మన్నపాలెం స్టీల్ సిటీ డిపోను కొనసాగించాలన్న డిమాండ్‌తో ఎన్ఎంయూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 27వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు వారికి సంఘీభావం తెలిపారు. ఈ ప్రాంత ప్రజల కోసం 1992 లో నామమాత్రం లీజుపై 8 ఎకరాల స్థలం ఇవ్వడం జరిగిందన్నారు. లీజు పూర్తి కావడంతో రూ.130 కోట్లు చెల్లించాలని.. లేనిపక్షంలో ఖాళీ చేయాలని ఉక్కుయాజమాన్యం చెప్పడం అన్యాయమన్నారు. ప్రజల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని డిపోను అక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మిక నాయకులు బి. సత్యనారాయణ, ఎస్. బాబ్జీ, ఈ. నరసింహారావు, ఉరుకూటి రాము నాయుడు, ఎన్ఎంయూ నాయకులు పి. సాయిరామ్, పి. శంకరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షణలో ఫార్మాకోవిజిలెన్స్ పాత్ర కీలకం

మహారాణిపేట: రోగుల ఆరోగ్యాన్ని సంరక్షించడంలో ఫార్మాకోవిజిలెన్స్ కీలక పాత్ర పోషిస్తుందని ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎ స్.ఎం.సంధ్యాదేవి అన్నారు. బుధవారం కాలేజీ సమావేశ మందిరంలో 5వ జాతీయ ఫార్మకోవిజిలెన్స్ వారోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఫార్మకాలజీ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.శ్యామల మాట్లాడుతూ ఫార్మకోవిజిలెన్స్ ప్రత్యేకతను వివరించారు.

పదవీ విరమణ అనంతరం కొత్త జీవితం



ఆచార్య సత్యనారాయణకు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ సుంకరి రవీంద్ర, ఆచార్య కృష్ణమోహన్

ఎంవీపీ కాలనీ : ఏ వ్యక్తికైనా పదవీ విరమణ అనంతరం జీవితంలో మరో కొత్త అధ్యాయం ఆరంభమవుతుందని దామోదర్ సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య వై.సత్యనారాయణ అన్నారు. ఎంవీపీ కాలనీ ఐఐఏఎం బిజినెస్ స్కూల్, డాక్‌యార్డ్ సంయుక్తంగా ×ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ఫర్ నావల్ డాక్‌యార్డ్ పోస్ట్ రిటైర్‌మెంట్ అడాప్షన్¥ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సేవల నుంచి విరమణ పొందిన తర్వాత కొత్త లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. ఇలాంటి ఓరియంటేషన్ కార్యక్రమాలు పునఃనిర్మాణానికి సహాయపడతాయన్నారు. ఐఐఏఎం డీన్ డాక్టర్ సుంకరి రవీంద్ర మాట్లాడుతూ ఐఐఏఎం బీస్కూల్ విద్యాపరమైన అంశాలతోపాటు నేవల్ ప్రటర్నిటీకి సేవలు అందించడం గర్వకారణమన్నారు. అనంతరం అతిథులను ఐఐఏఎం బీస్కూల్ డైరెక్టర్ జనరల్ కృష్ణమోహన్ సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఏయూ మాజీ వీసీ ఆచార్య రాజేంద్రప్రసాద్, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహరావు, కమాండర్ బీఎల్ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం



అమ్మవారిని దర్శించుకుంటున్న సీపీ బాగ్చీ

అల్లిపురం: ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన అవసరమని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల శ్రీ ధనశక్తి దుర్గాదేవి ఆలయ పీఠాన్ని బుధవారం సాయంత్రం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ నిర్వాహకుడు రవి భవానీ ఆహ్వానం పలికారు. గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి, టూటౌన్ సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు సీపీతో పాటు అమ్మవారిని దర్శించుకున్నారు.

చిరు వ్యాపారుల పొట్ట కొడుతున్న కూటమి ప్రభుత్వం

పెందుర్తి : పండగ వేళ చిరువ్యాపారుల జీవితాలను కూటమి ప్రభుత్వం చీకటిమయం చేసిందని వామపక్ష నాయకులు ఆరోపించారు. ఆపరేషన్ లంగ్స్ పేరిట నగరంలోని తోపుడుబళ్లు, బడ్డీ వ్యాపారులపై ప్రభుత్వం కక్ష సాధింపునకు నిరసనగా బుధవారం వేపగుంటలోని జోనల్ కార్యాలయం వద్ద వామపక్షాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా సీఐటీయూ నేత వెంకటరెడ్డి, సీపీఐ నేతలు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు మాట్లాడుతూ తక్షణమే ప్రభుత్వం చిరు వ్యాపారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఎక్కడెక్కడ వ్యాపారాలు చేసుకున్నారో వారికి అక్కడే అవకాశం కల్పించాలన్నారు. లేకపోతే కూటమి ప్రభుత్వంలోని కార్పొరేటర్ల ఇళ్ల ముట్టడితోపాటు భారీ ఉద్యమం చేపడతామన్నారు. హాకర్స్ జోన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.